

బురద నీటిలో పాఠశాలకు..

శంకరపట్నం: కేశవపట్నం ఎస్సీ హాస్టల్ విద్యార్థులు బురద నీటిలో పాఠశాలకు వెళ్తున్నారు. కేశవపట్నం ఎస్సీ బాలుర హాస్టల్ 40 మంది విద్యార్థులు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. ప్రతిరోజు ఉదయం హాస్టల్ నుంచి పాఠశాలకు, సాయంత్రం పాఠశాల నుంచి హాస్టల్‌కు బురద నీటిలో వెళ్తున్నారు. వర్షాకాలం ఆరంభం నుంచి రోడ్డంతా పచ్చి గడ్డి పెరిగింది. వారం రోజులుగా వాన పడడంతో పచ్చి గడ్డి ఏపుగా పెరగగా.. బురద నీటిలో నడిచి ఇబ్బందులు పడుతున్నారు. గడ్డిలో నడిస్తే విష పురుగులుంటాయని విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి మొరం పోసి రోడ్డు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.




ఆటోను నెడుతున్న రైతులు

బురదలో దిగబడిన ఆటో

గన్నేరువరం: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు, రైతులు, పశువుల కాపరులు అనేక అవస్థలు పడుతున్నారు. శనివారం రాత్రి చీమలకుంటపల్లె గ్రామ పంచాయతీ శివారు తుమ్మవానిపల్లెలో పాడి రైతుల వద్ద డెయిరీ సేకరించిన పాలను తీసుకురావడానికి చీమలకుంటపల్లె నుంచి తుమ్మవానిపల్లెకి పాల ఆటో వెళ్తుండగా రహదారిపై ఉన్న బురదలో దిగబడింది. మళ్లీ పాడి రైతులు వచ్చి ఆ ఆటోను బురద నుంచి అతికష్టమ్మీద బయటకు నెట్టారు.

కోతకు గురైన చెరువు కట్ట



శంకరపట్నం: అంబాల్‌పూర్ చెరువు కట్ట కోతకు గురైంది. అంబాల్‌పూర్ చెరువు మత్తడికి గతంలో గండి పడడంతో మరమ్మతు చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్నందున మత్తడి, సైడ్ వాల్ పనులు పూర్తి కాలేదు. శుక్రవారం సైడ్‌వాల్ నిర్మించే ప్లేట్లను కాంట్రాక్టర్ తీసుకెళ్లడంతో సైడ్ వాల్ పక్కన కట్ట శుక్రవారం రాత్రి నుంచి కోతకు గురైంది. నీరంతా దిగువకు వెళ్తోందని రైతులు ఆరోపించారు.

క్లుప్తంగా

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో రామారావు

ఇల్లందకుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎంగిలే రామారావు మంత్రి పొన్నం ప్రభాకర్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 22 సంవత్సరాలుగా పార్టీలో ఉంటూ క్రమశిక్షణ గల కార్యకర్తగా కష్టకాలంలో పార్టీకి విధేయుడిగా పని చేశానని తెలిపారు.

నియామక పత్రం అందజేత



లవ్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న అనిల్‌కుమార్ మాదిగ

రామడుగు: ఎమ్మార్పీఎస్ శాఖ మండల అధ్యక్షుడిగా శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన కొత్తూరి లవ్‌కుమార్ మాదిగను నియామకం చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌కుమార్ మాదిగ ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు దండు అంజయ్య, కొత్తూరి రాజన్న, చిలుముల లక్ష్మణ్, జెట్టుపల్లి అనిల్, కొత్తూరి లచ్చన్న, మధు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ మాధవిలత

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట ప్రభుత్వ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఎక్సైజ్ సీఐ మాధవిలత ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నిర్మూలనపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ చూపితే ఉన్నతస్థాయికి చేరుకుంటారని సూచించారు. మద్యం, మత్తు పదార్థాల వాడకంతో కలిగే నష్టాలపై వివరించారు. ఎస్‌ఐ సౌమ్య, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ అనూష

చొప్పదండి: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ అనూష కోరారు. పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫ్రెషర్ డే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కరస్పాండెంట్ అమిరిశెట్టి రత్నాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గుండేటి వెంకటరమణ, పంతగాని అనిల్‌కుమార్, వెంగల హరిప్రసాద్, స్వప్న, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



నినాదాలు చేస్తున్న చేనేత కార్మికులు

గంగాధర: పని లేక పస్తులుంటున్నాం, పని కల్పించాలని కోరుతూ గర్శకుర్తి గ్రామానికి చెందిన నేత కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం మూడో రోజుకు చేరింది. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల ఉత్పత్తికి అవకాశమివ్వడంతో కార్మికులకు ఉపాధి లభించిందని, ప్రస్తుతం పని లేదన్నారు. వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శంకరపట్నం: కేశవపట్నం గ్రామానికి చెందిన చెన్నవేని లచ్చమ్మ(89) కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న లచ్చమ్మ శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు లచ్చమ్మ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉద్యమించండి



రాపర్తి ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు



తిమ్మాపూర్: నివాళి అర్పిస్తున్న నాగేశ్వర్‌రెడ్డి, వాసుదేవారెడ్డి, నాయకులు

ఇల్లందకుంట: రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియజేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరో జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా శ్రేణులు సమష్టిగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రసాద్‌ను శాలువాతో సన్మానించారు. నాయకులు అంతం ఎల్లారెడ్డి, కంకణాల సురేందర్‌రెడ్డి, ఎండీ షఫీఖాన్, లావణ్య, కందాల రాజేందర్, తడిగొప్పుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

తిమ్మాపూర్: రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టి ప్రజలకు తెలియజేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లెం వాసుదేవారెడ్డి కార్యకర్తలకు సూచించారు. శనివారం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన మండల పార్టీ కార్యవర్గ సమావేశం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్‌చంద్ర, కార్యవర్గ సభ్యుడు బూట్ల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు కిన్నెర అనిల్, గొట్టిముక్కల తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎడ్ల జోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

గన్నేరువరం: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ అన్నారు. గన్నేరువరంలో పార్టీ కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగరేశారు. ఓబీసీ జిల్లా కార్యదర్శి మచ్చ బాలరాజు, ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి పర్శరాంగౌడ్, వీరగోని వెంకటేశ్, ఉపాధ్యక్షుడు గడ్డం సుమిత్‌రెడ్డి, చిగురు సంజీవ్, గూడెల్లి మల్లేశం, సోషల్ మీడియా బూత్ అధ్యక్షుడు కాంతాల రాజిరెడ్డి, బొంపల్లి గోవర్ధన్‌రెడ్డి, అకెన కృష్ణ, మడికంటి స్వామి, కూన లక్ష్మణ్, బుర్ర లక్ష్మణ్, నల్ల జైపాల్ రెడ్డి, బోయిని లక్ష్మణ్, కుర్ర హరీష్ పాల్గొన్నారు.

వీణవంక: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన బీసీ డిక్లరేషన్, ఆరు గ్యారంటీలు, ఏకకాలంలో రుణమాఫీ, అర్హులకు దళిత బంధు హామీలు వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు భాస్కరాచారి, పుప్పాల రఘు, ముదిగంటి విద్యాసాగర్‌రెడ్డి, నరసింహరాజు, మాడ గౌతంరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి



బండి సంజయ్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

శంకరపట్నం: కేశవపట్నం–ఎగ్లాస్‌పూర్ మీదుగా సైదాపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు శనివారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. కేశవపట్నం అంబేడ్కర్ చౌరస్తా నుంచి కరీంపేట మీదుగా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం వరకు రోడ్డు వెడల్పు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు అనిల్, వెంకటరెడ్డి, శ్రీనివాస్, కొంరయ్య, సారయ్య, ఖాజాపాషా తదితరులున్నారు.

రామడుగు: వెలిచాలకు చెందిన బీజేపీ నాయకుడు ఉప్పు శ్రీనివాస్‌పటేల్ తండ్రి ఉప్పు కొంరయ్య అనే వృద్ధుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. వీరి కుటుంబాన్ని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే బోడిగె శోభ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్‌యాదవ్, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, నాయకులు ఉప్పు రాంకిషన్, వీర్ల హన్మంతరావు, పర్శారాం, దిలీప్, నర్సింగం, నాగరాజు, మల్లేశం పాల్గొన్నారు.

చొప్పదండి: కొద్ది రోజులుగా పాల ధరలు గణనీయంగా తగ్గుతున్నాయని, రూ.10 వరకు లీటర్‌పై తగ్గింపు జరిగిందని, పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు దేశాయిపేట గ్రామస్తులు శనివారం వినతిపత్రం అందించారు. బండారి సునీల్, చిలువేరి శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మనోహర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలి



మనోహర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సురేందర్‌రెడ్డి

చిగురుమామిడి: గునుకులపల్లె గ్రామ పంచాయతీ పరిధి అర్కాలపల్లెకు చెందిన చిట్యాల మనోహర్‌రెడ్డి 12రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందినా.. ఆర్టీసీ యాజమాన్యం ఇంతవరకు ఎలాంటి సహాయక చర్యలు తీసుకోలేదని, తక్షణమే ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి కోరారు. శనివారం మనోహర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీజేపీ ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి బత్తుల శంకర్, రాష్ట్ర నాయకులు గొల్లపల్లి వీరాచారి, పోలోజు సంతోష్‌కుమార్, కె.శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, అనిల్, కిరణ్, వంశీ, మోహన్‌రెడ్డి, సాయి ఉన్నారు.

స్వామివారి హుండీ ఆదాయం రూ.2.92లక్షలు



చిగురుమామిడి: సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి హుండీని లెక్కించారు. శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన లెక్కింపులో పది నెలల ఆదాయం రూ.2.92లక్షలు వచ్చిందని ఆలయ ఈవో రాజ్‌కుమార్ తెలిపారు. ఈ ఆదాయాన్ని బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు వివరించారు. ఈ హుండీ లెక్కింపులో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన అలివేలు మంగ సేవాసమితి, రాజరాజేశ్వర సేవాసమితి, పద్మావతి సేవాసమితికి చెందిన సభ్యులు పాల్గొన్నారని తెలిపారు. పరిశీలకుడు పాము సత్యనారాయణ, సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, తాళ్లపల్లి సంపత్‌కుమార్, గందె సంపత్‌కుమార్, బొల్లబత్తిని మహేశ్, బొల్లం కనకయ్య, వెంకటలక్ష్మి, వెల్దండి లావాణ్య, చల్ల పద్మ, రాజవ్వ, రజిత, సుకన్య, అనిత, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పంపుహౌస్ వద్ద పూజలు



గాయత్రి పంపుహౌస్ వద్ద పూజలు చేస్తున్న రవిశంకర్

రామడుగు: లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ వద్ద నీటిని విడుదల చేయడంతో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శనివారం సాయంత్రం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు లోయర్ మానేరు డ్యాం, కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ 50వేల మంది రైతులతో కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించడంతో దిగివచ్చి నీటిని విడుదల చేశారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



రామడుగు: లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నాలుగు బాహుబలి మోటార్ల ద్వారా అధికారులు నీటిని విడుదల చేయడంతో శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపుహౌస్ వద్ద సంబరాలు జరుపుకున్నారు. కొక్కెరకుంట సింగిల్‌విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, నాయకులు పంజాల శ్రీనివాస్‌గౌడ్, జంకె రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గన్నేరువరంలో వైద్యశిబిరం

గన్నేరువరం: గన్నేరువరం గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం గన్నేరువరం లయన్స్ క్లబ్, నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఆరోగ్య ఆస్పత్రి డాక్టర్ రేగులపల్లి లక్ష్మీ, శ్రీకాంత రెడ్డి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఉచితంగా 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్లను నిర్వాహకులు సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బూర రామకృష్ణ, జోన్ మాజీ చైర్మన్ బొడ్డు సునీల్, లియో జిల్లా మాజీ కోఆర్డినేటర్ బూర శ్రీనివాస్, నారాయణ ఫౌండేషన్ అధ్యక్షుడు పాశ ప్రదీప్, పులి వినోద్, లింగంపల్లి వినోద్, బూర వెంకటేశ్వర్లు, కాంతాల కొండల్ రెడ్డి, జిల ఎల్లయ్య, కాంతాల కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

కులాల జన గణన సమితి కన్వీనర్‌గా రవీందర్



హుజూరాబాద్: రాష్ట్ర కులాల జన గణన సమితి హుజూరాబాద్ కన్వీనర్‌గా రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సామాజిక జేఏసీ చైర్మన్ రిటైర్డ్ ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ తెలిపారు. కోకన్వీనర్లుగా పులి జగన్నాథం, భీమోజు సదానందం, పెట్టెం కుమారస్వామి, సాదుల రవీందర్, సందెల వెంకటేశ్వర్లు, కేశవులు, బుచ్చన్న, టీఎస్‌సింగ్, పాలపెల్లి అమరేందర్‌గౌడ్, పులిపాక సారయ్యను ఎన్నుకున్నారు.

బోనాల సంబరాలు

తిమ్మాపూర్: శ్రీచైతన్య పాఠశాల, అలుగునూర్‌లోని ఐరిస్ పాఠశాలలో శనివారం బోనాల పండుగ అట్టహాసంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ బోనం ఎత్తుకొని విద్యార్థులంతా తిరిగారు. పోతురాజు వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉపాధ్యాయులు పండుగ విశిష్టతను వివరించారు. శ్రీచైతన్య ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, డీన్‌లు కృష్ణ, తిరుపతి, ఐరిస్ డైరెక్టర్లు ప్రసూన, అనుకర్, వినోద్, ప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చొప్పదండి: వరుసగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం అధిక వర్షాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

చొప్పదండి: మంగళపల్లి గ్రామంలో తొమ్మిదేళ్ల పాటు సేవలందించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు బిజిలి కనకయ్యను గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. తాజా మాజీ సర్పంచ్ వెల్మ నాగిరెడ్డి, తాజీ మాజీ ఎంపీటీసీ వెల్మ విజయలక్ష్మి, పెద్దెళ్లి సురేశ్, బైరి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను విస్మరించిన బడ్జెట్

హుజూరాబాద్: విద్యార్థులు, నిరుద్యోగుల ఆత్మ బలిదానాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోస్కుల అజయ్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ముగ్గురు పిల్లల జీవో తొలగించాలి

సైదాపూర్: వచ్చే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో ముగ్గురు పిల్లల జీవోను తొలగించాలని తెలంగాణ కురుమ సంఘం మండల అధ్యక్షుడు పెద్ది తిరుపతి, కేవైసీఎస్ మండల అధ్యక్షుడు వెంగల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో వారు వేర్వేరుగా మాట్లాడారు. సంతానంతో సంబంధం లేకుండా కనీస విద్యార్హతలు ఉండేలా చూడాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు, గ్లాసులు పంపిణీ

వీణవంక: చల్లూరు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో మామిడాలపల్లి గ్రామానికి చెందిన రామోజీ చంద్రమౌళి, దరిపెల్లి మురళి సహకారంతో విద్యార్థులకు 250 స్టీల్ గ్లాసులు, గ్రంథాలయ పుస్తకాలను అందజేశారు. ఎస్‌ఐ తిరుపతి, గణేశ్, గోనేల పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు

జమ్మికుంట: మడిపల్లి గ్రామంలోని హజ్రత్ సయ్యద్ ఉమర్‌షావలీ ఉర్సు ఉత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారని దర్గా అధ్యక్షుడు మహమ్మద్ మహమూద్ తెలిపారు. ఆదివారం గుసుల్ షరీఫ్, గొసేఆదం జెండా ఆవిష్కరణ, సోమవారం గంధం, మంగళవారం దీపారాధన, ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు.

'శ్రీకాంత్' చిత్రాన్ని తిలకించిన విద్యార్థులు

రామడుగు: వెదిర కస్తూర్బాగాంధీ పాఠశాలలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు ఉపాధ్యాయులు 'శ్రీకాంత్' చిత్రాన్ని చూపించారు. ఈ చిత్రం విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పాఠశాల ప్రత్యేకాధికారి కవిత అన్నారు.

గుంతల రోడ్డుపై వరి నాట్లతో నిరసన

చిగురుమామిడి: రామంచ–ఇందుర్తికి వెళ్లే క్రాసింగ్ వరకు రహదారి పూర్తిగా అధ్వానంగా ఉంది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అందులో నీరు నిలుస్తుంటుంది. దీంతో గుంతల లోతు తెలియక చాలామంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శనివారం ధర్మసమాజ్ పార్టీ మండల నాయకుడు పైస రాజ్‌కుమార్ వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

చొప్పదండి: ప్రతి నెల నాలుగో శనివారం నిర్వహించే నో బ్యాగ్ డేలో భాగంగా రెవెళ్ళి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా పొలం పనులను పరిశీలించారు. గ్రామ శివారులోని అమరేందర్‌రెడ్డి పొలంలో నాట్లు వేసే కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం సిరిపురం ఆనందం, ఉపాధ్యాయులు, ముల్కల కుమార్, రాజిరెడ్డి, సుమలత, రోజారాణి, పద్మ, రైతులు అశోక్‌రెడ్డి, అంజయ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి



వెదిర జిల్లాపరిషత్ పాఠశాలకు బీరువాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రామడుగు: ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలని పెద్దపల్లి ఎల్‌ఐసీ శాఖ మేనేజర్ భీరెడ్డి ప్రేమ్‌సాగర్‌రెడ్డి కోరారు. రామడుగు మండలం వెదిర జిల్లాపరిషత్ పాఠశాలకు శనివారం పుస్తకాలు భద్రపర్చుకునే బీరువాలను పాఠశాల పూర్వ విద్యార్థులు(1971–81) అందజేశారు. ఇదే పాఠశాలలో చదువుకొని ఈరోజు ఈ స్థాయికి ఎదిగానని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, కేశోరాం ఫ్యాక్టరీ రిటైర్డు ఉద్యోగి వంచ వెంకట్‌రెడ్డి, ఆర్టీసీ ఉద్యోగి మల్లారెడ్డి, ఎన్నారై కోతి మునిరెడ్డి, తుమ్మనపల్లి ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వన మహోత్సవం



రామడుగు: మొక్క నాటుతున్న ఎంఈవో వేణుకుమార్



ఇల్లందకుంట: మొక్క నాటుతున్న ఉపాధ్యాయ బృందం

రామడుగు: గోపాల్‌రావుపేట జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో శనివారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పలు రకాల మొక్కలను నాటారు. పాఠశాలలో మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ మొక్కలు నాటి ప్రతి పాఠశాలలో మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: టేకుర్తి ఆదర్శ పాఠశాలలో వన మహోత్సవం ఇన్‌చార్జి అన్వర్ పాషా ఆధ్వర్యంలో 200 మొక్కలు నాటారు. ఎకో క్లబ్‌ను ఏర్పాటు చేసి విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పదోతరగతి విద్యార్థి డి.ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. సభ్యులుగా వ్యవస్థ అవినాష్, లక్ష్మీప్రసన్న, సుదీప్, మణిదీప్, అంకిత సాయిరాం, రేవతి, శ్రీనిత, రాజు, బాబా, సూర్యతేజ, ఉషశ్రీని ఎన్నుకున్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా.. గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి 19వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న కోటి ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా శనివారం మొక్కల పంపిణీ చేపట్టారు. ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. వార్డు ఆఫీసర్ శ్రీకాంత్, ఆర్పీ సృజన, నాయకులు ఉడత వెంకటేశ్, అడెపు దేవరాజ్, రామచంద్రం, వెంకటేశ్వర్లు, అలీ రజియా, మైరు జాఫర్, లక్ష్మి పాల్గొన్నారు.